Power of Journalism

# పవర్ ఆఫ్ జర్నలిజం

PJ NEWS

/PJNEWS www.pjnewslive.com

కావలెను
ఆంధ్రా మరియు తెలంగాణా రాష్ట్రాలకు
కో ఆర్డినేటర్లు, స్టాఫ్ రిపోర్టర్లు,
మండల రిపోర్టర్లు, ఫ్రింగర్లు
కావలెను
93477 26601
Google Play

Circulated at : Hyderabad, Guntur, Vijayawada, Prakasam, Anantapur, Nellore, YSR Kadapa, Visakhapatnam, East & West Godavari Districts.

అమరావతి | ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | బుధవారం 02 ఆగస్టు2023 | సంపుటి : 9 | సంచిక: 93 | పేజీలు : 4 | వెల : రూ. 2/-



## ప్రజలకు వివరణ ఇవ్వాలి

- ఏపీ ప్రభుత్వం చేసిన అప్పులపై లెక్కలు చెప్పిన పురందేశ్వరి!
- జగన్ ప్రభుత్వం చేసిన అప్పులకు, తప్పులకు మల్లగుల్లాలు పడుతోందన్న పురందేశ్వరి
- నిర్మలా సీతారామన్ ఆర్బీఐ పరిధిలో తీసుకున్న అప్పుల గురించి చెప్పారని వెల్లడి
- తాను అనధికారికంగా చేసిన అప్పులు గురించి చెప్పానని వివరణ

**పవర్ ఆఫ్ జర్నలిజం ప్రతినిధి, విశాఖ**

ఆంధ్రప్రదేశ్ అప్పులపై కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ చేసిన ప్రకటనపై ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి స్పం దించారు. జగన్ ప్రభుత్వం గత నాలుగేళ్లలో తాను చేసిన అప్పులకు, తప్పులకు మల్లగుల్లాలు పడుతోందన్నారు. - మిగతా3లో

## ఇది ఆణిముత్యంలాంటి ప్రాజెక్టు



- దక్షిణాదిలోనే విశాఖ ఇనార్బిట్ మాల్ అతిపెద్దది
- మాల్ నిర్మాణంతో విశాఖ రూపురేఖలు మారిపోతాయి
- విశాఖలో ఒక ఆణిముత్యంగా నిలిచిపోయే ప్రాజెక్టు ఇనార్బిట్ మాల్
- ఫైవ్ స్టార్ హోటల్ కూడా నిర్మించాలని రహేజా గ్రూప్ ఆసక్తిగా ఉంది
- రహేజా గ్రూప్‌కు అన్ని విధాలుగా సపోర్టు ఇస్తాం.
- ఒక్క ఫోన్‌కాల్‌తో అందుబాటులో ఉంటాం

**పవర్ ఆఫ్ జర్నలిజం ప్రతినిధి, విశాఖ**

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈరోజు(మంగళవారం) విశాఖ పర్యటన సందర్భంగా అక్కడ రూ.600 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న రహేజా గ్రూప్స్ ఇనార్బిట్ మాల్‌కు భూమి పూజ చేశారు. విశాఖపట్నం కైలాసపురంలో నిర్మిస్తున్న ఇనార్బిట్ మాల్ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు సీఎం జగన్.
ఈ సందర్భంగా సీఎం జగన్ ఏమన్నారంటే.. దేవుడి దయతో మరో మంచి కార్యక్రమం ఇక్కడ ప్రారంభమవుతుంది. విశాఖ అభివృద్ధికి మరింత దోహదం చేస్తూ... విశాఖపట్టణంలో ఆణిముత్యంగా నిల్చిపోయే మంచి ప్రాజెక్టుకు శంకుస్థాపనతో - మిగతా3లో



## ఇదేనా మీ విచారణ

- మణిపూర్ పోలీసులపై మండిపాటు..
- డీజీపీకి సుప్రీం కోర్టు సమన్లు
- మణిపూర్‌లో శాంతి భద్రతల అనే మాటే లేదు.
- రాష్ట్ర యంత్రాగం పూర్తిగా విఫలమైంది
- మే నుండి జులై చివరి వరకు రాజ్యాంగ యంత్రాంగం పూర్తిగా విచ్ఛిన్నమైంది

2



## జగన్‌కు సొంత సామాజికవర్గంలో కూడా వ్యతిరేకత

**పవర్ ఆఫ్ జర్నలిజం ప్రతినిధి, ప్రకాశం**

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 17 రోజుల పాటు కొనసాగిన నారా లోకేశ్ యువగళం పాదయాత్ర... మంగళవారం పల్నాడు జిల్లా వినుకొండ అసెంబ్లీ నియోజకవర్గంలోకి ప్రవేశించింది. తొలిరోజు వినుకొండ నియోజక వర్గంలో వేలాది ప్రజలు, నాయకులు, కార్యకర్తలు యువనేతకు అపూర్వ స్వాగతం పలికారు. వినుకొండ నియోజకవర్గం ముప్పరాజుపాలెం వద్ద పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు నేతృత్వంలో యువనేతకు ఘనస్వాగతం పలికారు. వేదపండితుల - మిగతా3లో

## రౌడీయిజం చేస్తే తాటతీస్తా..



- రాయలసీమ కోసం జగన్ ఏనాడైనా పనిచేశారా?
- వైసీపీ పాలనలో నియోజకవర్గానికో సైకో తయారవుతున్నాడు
- రోడ్డుకు మట్టి వేయలేరు.. 3 రాజధానులు కడతారట అంటూ ఎద్దేవా
- వైసీపీని భూస్థాపితం చేస్తే తప్ప న్యాయం జరగదని వ్యాఖ్య
- ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా నంద్యాల జిల్లాలో పర్యటన
- టీడీపీ అధికారంలోకి వస్తే మద్యం ధరలను తగ్గిస్తాం
- నాణ్యమైన మద్యాన్ని సరఫరా చేస్తానని హామీ
- వైసీపీ ప్రభుత్వం విచిత్రమైన బ్రాండ్లను అమ్ముతోంది

**పవర్ ఆఫ్ జర్నలిజం ప్రతినిధి, నంద్యాల**

రాయలసీమ ప్రాజెక్టుల పర్యటన కోసం నంద్యాల జిల్లా నందికొట్కూరు చేరుకున్న టీడీపీ అధినేత చంద్రబాబు ఇవాళ పట్టణంలో రోడ్ షో నిర్వహించారు. భారీ ఎత్తున తరలివచ్చిన టీడీపీ కార్యకర్తల్ని ఉద్దేశించి మాట్లాడారు. ముందుచూపుతోనే ప్రాజెక్టులను తెలుగుదేశం చేపట్టిందని చంద్రబాబు తెలిపారు. కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల కోసం చేపట్టిన ప్రాజెక్టు హంద్రీనీవా అన్నారు. ప్రతి ఎకరాకు నీళ్లు ఇవ్వాలని సంకల్పించానని ఆయన గుర్తుచేశారు. వైసీపీ పాలనలో నియోజకవర్గానికో సైకో తయారవుతున్నారని టీడీపీ అధినేత చంద్రబాబు - మిగతా3లో



## ఢిల్లీకి సంబంధించి ఏ చట్టాన్నైనా రూపొందించే అధికారం పార్లమెంటుకు ఉంది

- ఢిల్లీ ఆర్డినెన్స్ బిల్లును లోక్ సభలో ప్రవేశ పెట్టిన అమిత్ షా
- బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్న విపక్షాలు
- రాజకీయ దురుద్దేశాలతోనే బిల్లును విపక్షాలు అడ్డుకుంటున్నాయన్న అమిత్ షా
- బిల్లు చట్టరూపం దాలిస్తే ఢిల్లీ ప్రభుత్వ అధికారాలకు కత్తెర
- అధికారుల నియామకాలు, బదిలీలపై కేంద్రానిదే పెత్తనం

2

## విశాఖ వృద్ధురాలి హత్యపై పిచ్చి రాతలు




- పవన్‌ను చూస్తే జాలేస్తోంది.. విశాఖ వృద్ధురాలి హత్యపై పిచ్చి రాతలు
- చంద్రబాబు కుళ్లు రాజకీయాలు చేస్తున్నాడు
- ఏపీని అప్పుల పాలు చేశారని పచ్చ బ్యాచ్ సీఎం వైఎస్ జగన్‌పై దుష్ప్రచారానికి దిగింది
- పచ్చ పార్టీకి.. పిచ్చి రాతలు రాసే వాళ్ల నోళ్లు మూతలుబడేలా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమాధానం చెప్పారు
- సీఎం జగన్ నాలుగేళ్లుగా సంక్షేమపాలన అందిస్తున్నారు
- ప్రజాభిమానమూ పెరిగింది.
- చంద్రబాబు దుర్మార్గుడు. చంద్రబాబు కొడుకు మాలోకం.
- చిరంజీవి కుటుంబంపై చంద్రబాబు చేసిన కుట్రలు అందరికీ తెలిసిందే

**పవర్ ఆఫ్ జర్నలిజం ప్రతినిధి, అమరావతి:**

పేదల పొట్ట కొట్టాలని చంద్రబాబు కుళ్లు రాజకీయాలు చేస్తున్నాడని.. ఈ క్రమంలోనే పచ్చ మీడియాతో పిచ్చి రాతలు రాయిస్తున్నాడని.. అయితే వాస్తవాలు బయటపడడంతో ఇప్పుడు ఆ నోళ్లు మూతలు పడుతున్నాయని ఏపీ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. మంగళవారం సచివాలయంలో ఆయన మాట్లాడుతూ.. పది లక్షల కోట్లు అప్పులు చేశారని.. ఏపీని అప్పుల పాలు - మిగతా3లో



## అంబానీ.. అదానీ ఓకే.. మరి మనం?

- రూ.1.4 కోట్లు ఉంటే చాలు..
- టాప్ 1 శాతం రిచెస్ట్ జాబితాలో ఎంట్రీ ఇచ్చినట్లే!
- పపంచంలో ధనికులు ఎక్కువగా ఉండే మొనాకోలో ఇది రూ.102 కోట్లుగా ఉంది

2

# ఇదేనా మీ విచారణ..

**ఢిల్లీ:** మణిపూర్ హింసపై విచారణ జరుపుతున్న సుప్రీం కోర్టు ఇవాళ(మంగళవారం) మణిపూర్ పోలీస్ శాఖపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. వేలకొద్ది ఎఫ్ఐఆర్‌లు నమోదు అయినప్పటికీ.. అరెస్ట్‌లు జరగలేదని, విచారణలోనూ నిర్లక్ష్యం కనిపించిందని వ్యాఖ్యానించింది. అసలు ఎఫ్ఐఆర్‌లు ఇలాగేనా? నమోదు చేసేదని మణిపూర్ పోలీస్ శాఖపై మండిపడింది. వ్యక్తిగతంగా తమ ఎదుట హాజరు కావాలంటూ మణిపూర్ డీజీపీని సమన్లు జారీ చేసింది. మణిపూర్‌లో శాంతి భద్రతల అనే మాటే లేదు. రాష్ట్ర యంత్రాగం పూర్తిగా విఫలమైంది. హింస చెలరేగి మూడు నెలలైనా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయలేదు. అరెస్టులు జరగలేదు. విచారణలో అడుగడుగునా నిర్లక్ష్యం, నిర్లిప్తత కనిపిస్తోందంటూ మణిపూర్ పోలీస్ శాఖపై ఆగ్రహం వ్యక్తం చేసింది కోర్టు.

సీజేఐ చంద్రచూడ్ కామెంట్లు..

మే నుండి జులై చివరి వరకు రాజ్యాంగ యంత్రాంగం పూర్తిగా విచ్ఛిన్నమైంది జూలై 25, 2023 నాటికి 6496 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని మణిపూర్ తరపున దాఖలు చేసిన నివేదిక పేర్కొంది. అధికారిక నివేదికల ప్రకారం 150 మరణాలు సంభవించాయని, 502 మంది గాయపడ్డారని, 5,101 కేసులు ఉన్నాయని స్టేటస్ రిపోర్ట్ పేర్కొన్నట్లు సుప్రీంకోర్టు పేర్కొంది. కాల్పులు మరియు 6,523 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ఎఫ్ఐఆర్‌లలో 252 మందిని అరెస్టు చేయగా, నివారణ చర్యల కోసం 1,247 మందిని అరెస్టు చేశారు. 11 ఎఫ్ఐఆర్‌లకు సంబంధించి 7 మందిని



అరెస్టు చేసినట్లు స్టేటస్ నివేదిక పేర్కొంది. 11 ఎఫ్ఆఐర్‌లు మహిళలపై జరిగిన వేధింపుల ఘటనకు సంబంధించినవి పేర్కొన్నారు. అసలు వీటిలో ఎన్ని జీరో ఎఫ్ఐఆర్‌లు ఉన్నాయి? ఎఫ్ఐఆర్‌ల నమోదులో గణనీయమైన లోపం కనిపిస్తోంది. కాబట్టి.. మణిపూర్ డీజీపీ శుక్రవారం(ఆగస్టు 4వ తేదీ) మధ్యాహ్నం 2 గంటలకు ఈ కోర్టు ముందు వ్యక్తిగతంగా హాజరు కావాలి. కోర్టుకు ఆయన సమాధానం చెప్పే స్థితిలో ఉండాలి అని తెలిపింది. ఆ సమయంలో ప్రభుత్వం తరపున వాదనలు వినిపిస్తున్న సొలిసిటర్ జనరల్ విజ్ఞప్తి చేయడంతో.. సోమవారం(ఆగస్టు 7వ తేదీకి) మధ్యాహ్నానికి డీజీపీ హాజరు కావాలని ఆదేశాలు సవరించింది ధర్మాసనం. సమగ్ర నివేదికతో తమ ముందుకు రావాలని ఆదేశించారు సీజేఐ డీవై చంద్రచూడ్. ఎవరు బాధితుడు.. ఎవరు నేరస్తుడు అనేదాంతో సంబంధం లేదు. ఎవరు నేరం చేసినా కోర్టు తీరు ఇలాగే ఉంటుందని ఆయన ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ఘటన జరిగిన తేదీ, జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన తేదీ, సాధారణ ఎఫ్ఐఆర్ నమోదు చేసిన తేదీ, సాక్షుల వాంగ్మూలాలు నమోదు చేయబడిన తేదీ, సెక్షన్ 164 సిఆర్‌పిసి కింద స్టేట్‌మెంట్‌లు నమోదు చేయబడిన తేదీ, అరెస్టుల తేదీ.. మొత్తం అన్నింటితో స్టేట్‌మెంట్ రూపొందిం చాలని తెలిపారు.

రాష్ట్ర పోలీసులు విచారణ చేపట్టే పరిస్థితుల్లో మనం లేం. కాబట్టి.. ఒక యంత్రాంగం అవసరం. 6,500 ఎఫ్ఐఆర్‌ల దర్యాప్తును సీబీఐకి అప్పగించడం అసాధ్యమన్న విషయంపై మాకు స్పష్టత ఉంది. అదే సమయంలో.. రాష్ట్ర పోలీసులకు అప్పగించబడదు. అందుకే.. ప్రభుత్వ పనితీరును పరిశీలించడం, పరిహారం, పునరుద్ధరణ పనులు, దర్యాప్తు స్వతంత్ర్యంగా జరిగేలా చూడడం, స్టేట్‌మెంట్లు నమోదు చేయడం.. ఇలా అన్ని వ్యవహారాలను చూసుకునేందుకు మాజీ న్యాయమూర్తుల కమిటీ ఏర్పాటును పరిశీలించాలని సొలిసిటర్ జనరల్‌కు సుప్రీంకోర్టు సూచించింది.

## నైగర్‌లో సైనిక తిరుగుబాటు..
## ఫ్రాన్స్ దేశస్తులు తిరుగు టపా..




**నియామే:** నైగర్‌లో సైనిక తిరుగుబాటును వ్యతిరేకించిన కారణంగా ఫ్రాన్స్ దేశానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ భారీగా ర్యాలీలు చేశారు సైనిక మద్దతుదారులు. దీంతో నైగర్‌లో ఉండే ఫ్రాన్స్ దేశస్తులకు హాని ఉందన్న కారణంతో వారిని వెంటనే వెనక్కు రప్పించనున్నట్లు తెలిపింది ఫ్రాన్స్ ఎంబసీ. 1960లో ఫ్రాన్స్ నుండి స్వాతంత్ర్యం పొందిన నైగర్‌లో 2021లో ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరిగాయి. అందులో అధ్యక్షుడిగా ఎన్నికైన మహమ్మద్ బజోమ్స్ పరిపాలనలో ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్నారని సైన్యం ఆరోపిస్తూ ఆయనను గద్దె దించాలని నిర్ణయించుకుంది సైన్యం. ఇటీవలే ఆయను అధ్యక్ష పదవి నుండి తొలగిస్తున్నట్లు కూడా ప్రకటించారు సైన్యాధ్యక్షుడు కల్నల్ మజ్ అమదౌ అబ్రందానే. నైగర్‌లో సైనిక తిరుగుబాటు చేసి ఆ దేశ అధ్యక్షుడిని అరెస్టు చేసిన తర్వాత సైనిక చర్యపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఫ్రాన్స్ దేశం సైనిక తిరుగుబాటును వ్యతిరేకించగా రష్యా సమర్థించింది. ఈ నేపథ్యంలో నైగర్‌లో తిరుగుబాటు సైన్యానికి మద్దతుదారులు రష్యాకు జేజేలు పలుకుతూ ఫ్రాన్స్ దేశానికి వ్యతిరేకం గా నినాదాలు చేస్తూ రాజధాని నగరంలో భారీగా ప్రదర్శన చేశారు. దీంతో ఫ్రాన్స్ దేశస్తులకు నైగర్‌లో ప్రమాదమని భావించి వారిని వెనక్కు రాపించే ప్రయత్నం చేస్తోంది ఫ్రాన్స్ ఎంబసీ.

## ఒకే వేదికపై మోదీ, శరద్ పవార్..
## ఇవి ఎప్పటికీ
## గుర్తుండిపోయే క్షణాలన్న ప్రధాని

**పూణేలో తిలక్ స్మారక్ మందిర్ ట్రస్ట్ కార్యక్రమానికి హాజరైన మోదీ, పవార్**

**లోకమాన్య తిలక్ జాతీయ పురస్కారాన్ని స్వీకరించిన ప్రధాని**

**పవార్‌ను ఆప్యాయంగా పలకరించిన మోదీ**



రాజకీయాల్లో కొన్ని ఆసక్తికర విషయాలు చాలా అరుదుగా జరుగుతుంటాయి. ఈరోజు అలాంటి ఘటనే ఒకటి చోటుచేసుకుంది. ప్రధాని మోదీ, ఎన్సీపీ అధినేత శరద్ పవార్ లు ఒకే వేదికను పంచుకున్నారు. మహారాష్ట్రలోని పూణేలో తిలక్ స్మారక్ మందిర్ ట్రస్ట్ నిర్వహించిన కార్యక్రమానికి వీరిద్దరూ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో లోకమాన్య తిలక్ జాతీయ పురస్కారాన్ని మోదీ స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శరద్ పవార్ ను మోదీ ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ ఇవి తనకు గుర్తుండిపోయే క్షణాలని చెప్పారు. ఇండియా కూటమి మూడో సమావేశం త్వరలో ముంబైలో జరగబోతున్న తరుణంలో ప్రధానితో వేదికను పంచుకోవడం సరికాదని కొందరు నేతలు చెప్పినప్పటికీ శరద్ పవార్ పట్టించుకోలేదు. లోక్ సభలో మోదీ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం నేపథ్యంలో బీజేపీ పట్ల కఠినంగా వ్యవహరించాల్సిన శరద్ పవార్, మోదీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వెళ్లడం వారికి మింగుడు పడటం లేదు.

## చెన్నై తిరుచ్చి విమానాశ్రయంలో కలకలం..
## సూట్‌కేసులో కొండచిలువలు, బల్లులు

**చెన్నై:** మలేషియా ఎయిర్ లైన్స్ విమానంలో తిరుచ్చి విమానశ్రయానికి వచ్చిన ఓ ప్రయాణికుడి సూట్‌కేసులో ప్రమాదకరమైన కొండచిలువలు, పాములు, బల్లులు ఉండటాన్ని చూసి విస్తుపోయారు తిరుచ్చి కస్టమ్స్ సిబ్బంది. వాటిని స్వాధీనం చేసుకుని అతడిని అరెస్టు చేశారు కస్టమ్స్ అధికారులు. సినిమాల ప్రభావమో ఏమోగానీ స్మగ్లింగ్ పేరిట ఏది పెడితే అది విమానాల్లో రవాణా చేసే స్థాయికి ఎదిగిపోయారు స్మగ్లర్లు. తాజాగా మొహమ్మద్ మొయిద్దీన్ అనే ఓ ప్రయాణికుడు కౌలాలంపూర్ నుండి వస్తూ తనతోపాటు సూట్‌కేసులో కొండచిలువ పిల్లలు, బంగారు బల్లుల్ని వెంట తీసుకొచ్చాడు. ఎయిర్పోర్టు కస్టమ్స్ అధికారులు ఆతడి సూట్‌కేసును తనిఖీ చేయగా అందులో 47 కొండచిలువ పిల్లలు, 2 బంగారు బల్లులను కనుగొన్నారు. అవి ప్రాణాలతో ఉండటాన్ని చూసి కంగారుపడ్డ కస్టమ్స్ అధికారులు వెంటనే వాటిని స్వాధీనం చేసుకుని అటవీ శాఖ అధికారులకు అప్పగించి అతడిని మాత్రం విచారణ నిమిత్తం కస్టడీకి తరలించారు. విమానంలో సజీవంగా ఉన్న కొండచిలువలను, బల్లులను ఎలా తీసుకువచ్చి ఉంటాడన్నదే కస్టమ్స్ అధికారులను



ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అతను మలేషియాలో సెక్యూరిటీ వాళ్ళ కళ్ళుగప్పి ఎలా రాగలిగాడు, అక్కడి ఎయిర్పోర్టు సిబ్బంది సరిగ్గా తనిఖీలు నిర్వహించలేదా ఏంటన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. అతనెవరు? అసలెందుకు చెన్నై వచ్చాడు? ఈ స్మగ్లింగ్ ముఠాలో ఇంకా ఎవరెవరున్నారన్న వివరాలపై ఆరా తీస్తున్నారు కస్టమ్స్ అధికారులు.

## అంబానీ.. అదానీ ఓకే.. మరి మనం?



ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడు ఓసారి మస్క్ అని మరోసారి మరొకరని.. ఒకదాంట్లో అంబానీ టాప్ అని.. మరొకదాంట్లో అదానీ అని.. ఇలా అత్యంత కుబేరుల జాబితాలు ఎప్పటికప్పుడు వస్తూనే ఉంటాయి.. ఇంతకీ దేశంలో టాప్ 1 శాతం రిచెస్ట్ జాబితాలో చేరాలంటే.. ఎంత సంపద ఉండాలో మీకు తెలుసా? తెలియదు కదా.. అందుకే ఆ పనిని గ్లోబల్ రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ నైట్ ఫ్రాంక్ చేసిపెట్టింది. వివిధ దేశాల్లో టాప్ 1 శాతం ధనవంతుల జాబితాలో చేరాలంటే.. వ్యక్తిగత నికర సంపద కనీసం ఎంత ఉండాలి(కటాఫ్ మార్క్) అన్న వివరాలను విడుదల చేసింది. దీని ప్రకారం వ్యక్తిగత నికర సంపద(అప్పులన్నీ తీసేయగా మిగిలినది) కనీసం రూ.1.4 కోట్లు ఉంటే చాలు.. మీరు మన దేశంలోని 1 శాతం ధనవంతుల జాబితాలోకి ఎంట్రీ ఇచ్చినట్లే. ప్రపంచంలో ధనికులు ఎక్కువగా ఉండే మొనాకోలో ఇది రూ.102 కోట్లుగా ఉంది. ఈ జాబితాలో మొనాకోదే ఫస్ట్ ప్లేస్.

## ఢిల్లీకి సంబంధించి ఏ చట్టాన్నైనా
## రూపొందించే అధికారం పార్లమెంటుకు ఉంది

దేశ రాజధాని ఢిల్లీలో ప్రభుత్వ అధికారుల నియామకాలు, బదిలీలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఢిల్లీ పరిపాలన సేవల నియంత్రణ బిల్లును తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఈ బిల్లును కాసేపటి క్రితం కేంద్ర హెూంమంత్రి అమిత్ షా లోక్ సభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ... ఢిల్లీకి సంబంధించి ఏ చట్టాన్నైనా తీసుకొచ్చే అధికారాన్ని పార్లమెంటుకు రాజ్యాంగం కల్పించిందని చెప్పారు. చట్టాన్ని తీసుకొచ్చే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉందని గతంలోనే సుప్రీంకోర్టు తెలిపిందని అన్నారు. కేవలం రాజకీయపరమైన దురుద్దేశాలతోనే బిల్లును అడ్డుకునేందుకు విపక్షాలు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. బిల్లును అనుమతించాలని స్పీకర్ ను కోరారు. విపక్షాల ఆందోళనల మధ్యే బిల్లును స్పీకర్ స్వీకరించారు.

**ఢిల్లీ అధికారాల ఆర్డినెన్స్ బిల్లును లోక్ సభలో ప్రవేశపెట్టిన అమిత్ షా.. విపక్షాల ఆందోళన**

ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వ అధికారాలకు కత్తెర వేసే ఢిల్లీ అధికారాల ఆర్డినెన్స్ బిల్లును కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశ పెట్టింది. కేంద్ర హెూంమంత్రి అమిత్ షా ఈ బిల్లును ప్రవేశపెట్టారు. ఈ బిల్లు పాస్ అయితే ఢిల్లీలోని అధికారులపై పెత్తనం కేంద్ర ప్రభుత్వం చేతుల్లోకి వెళ్తుంది.



అధికారుల నియామకాలు, బదిలీల అంశం కేంద్రం నియంత్రణలోకి వెళ్తుంది. ఈ విషయంలో ఢిల్లీ ప్రభుత్వానికి ఎలాంటి అధికారాలు ఉండవు. ఈ బిల్లును ఆప్ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. విపక్ష ఇండియా కూటమి పార్టీలు కేజ్రీవాల్ కు అండగా నిలిచాయి. బిల్లును అమిత్ షా సభలో ప్రవేశపెడుతున్నప్పుడు ఇండియా కూటమి ఎంపీలు నిరసన వ్యక్తం చేశారు. కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో మధ్యాహ్నం 3 గంటల వరకు సభను లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా వాయిదా వేశారు.

## చంద్రయాన్-3లో కీలక అడుగు..
## చంద్రుని కక్ష్య వైపు ప్రయాణం




**సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా):** గత నెల 14వ తేదీన ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్-3 మిషన్‌కు సోమవారం అర్ధరాత్రి దాకా లూనార్ ట్రాన్స్‌ఫర్ ట్రాజెక్టరీ అనే ఆపరేషన్‌ను చేపట్టారు. ప్రొపల్షన్ మాడ్యూల్‌లో నింపిన అపోజి ఇంధనాన్ని మండించి చంద్రయాన్-3 మిషన్‌ను భూకక్ష్య నుంచి చంద్రుని కక్ష్యవైపు మళ్లించే ప్రక్రియను విజయవంతంగా చేపట్టారు. ఇలా చంద్రయాన్-3 కక్ష్య దూరం మరోమారు పెంచారు. అక్కడ నుంచి ఐదు రోజులపాటు చంద్రుడి చుట్టూ దీర్ఘవృత్తాకార కక్ష్యలో పరిభ్రమించి వంద కిలోమీటర్ల వృత్తాకార కక్ష్యలోకి తీసుకురావడానికి ఐదు రోజుల సమయం తీసుకుంటుంది. ఆ కక్ష్యలోకి వచ్చాక ఆగస్టు 23వ తేదీన ప్రొపల్షన్ మాడ్యూల్ చంద్రునికి 30 కిలోమీటర్ల ఎత్తుకు చేరుకుంటుంది. తర్వాత అది ల్యాండర్‌ను జార విడుస్తుంది. ఆ రోజు సాయంత్రం 5.47 గంటలకు ల్యాండర్ చంద్రుడి దక్షిణ ధ్రువం ప్రాంతంలో దిగుతుంది. ల్యాండర్ విచ్చుకుని లోపలి నుంచి రోవర్ బయటకు అడుగుపెట్టనుంది. అది చంద్రుడిపై 14 రోజుల పాటు పరిశోధనలు చేసి సమాచారాన్ని అందిస్తుంది. అంటే చంద్రయాన్-3 మిషన్ చంద్రుడి కక్ష్యలోకి చేరుకోవడానికి ఇంకా 17 రోజులు, చంద్రుడిపై దిగడానికి 23 రోజులు పడుతుందన్న మాట.

## పిల్లలను తాకట్టు పెట్టి
## టమాటాలతో పరార్..
## ఒడిశాలో నయా మోసం

**పిల్లలను విచారించగా బయటపడ్డ మోసం**

**ఆయన ఎవరో కూడా తెలియదన్న పిల్లలు**

**పని ఇప్పిస్తానంటూ తీసుకు వచ్చాడని వెల్లడి**

టమాటా ధరలు విపరీతంగా పెరగడంతో చాలామంది వాటిని కొనడం మానేశారు. కొంతమంది మాత్రం కొత్తరకం మోసాలకు పాల్పడుతూ టమాటాలను ఎత్తుకెళుతున్నారు. టమాట లారీ బోల్తా పడడంతో పోలీసులు కాపలాగా ఉన్నారని.. 'వాహనం బోల్తా పడడంతో గాయపడిన డ్రైవర్ ను పట్టించుకోకుండా టమాటాలు తీసుకెళ్లిన జనం' వంటి వార్తలు చూస్తూనే ఉన్నాం. ఒడిశాలో మాత్రం ఓ కొత్త రకం మోసం బయటపడింది. టమాటా వ్యాపారిని ఓ వ్యక్తి బురిడీ కొట్టించాడు. తనతో వచ్చిన ఇద్దరు పిల్లలను షాపు దగ్గర కూచోబెట్టి నాలుగు కిలోల టమాటాలతో పరారయ్యాడు. కటక్‌లోని ఛత్రబజార్ ఏరియాలో ఉన్న ఓ కూరగాయల దుకాణంలో ఈ ఘటన జరిగింది. ఇద్దరు పిల్లలతో కలిసి వచ్చిన ఓ వ్యక్తి నాలుగు కిలోల టమాటాలు తీసుకున్నాడు. మరో పది కిలోలు కూడా కావాలని చెప్పాడు. ఆపై బ్యాగు తీసుకొస్తానని, అప్పటి వరకు తన పిల్లలు ఇక్కడే ఉంటారని నాలుగు కిలోల టమాటాలతో వెళ్లిపోయాడు. ఎంతసేపటికీ ఆ వ్యక్తి తిరిగి రాకపోవడంతో వ్యాపారి అనుమానించాడు. పిల్లలను విచారించడంతో తన అనుమానం నిజమేనని నిర్ధారణ అయింది. తమను తీసుకొచ్చిన వ్యక్తి ఎవరో అసలు తమకు తెలియదని ఆ పిల్లలు చెప్పారు. పని ఇప్పిస్తానని, చెరో రూ.300 ఇస్తానని చెప్పడంతో ఆయనతో కలిసి వచ్చామని వివరించారు.

## తెల్లవారుజామునే కూరగాయల మార్కెట్‌లో రాహుల్ గాంధీ

**వ్యాపారులతో మాట్లాడిన కాంగ్రెస్ నేత..**

**ఢిల్లీలోని ఆజాద్‌పూర్ మండీకు వెళ్లిన రాహుల్**

**మండీలో కలియదిరిగి.. కూరగాయలు, పండ్ల వ్యాపారులతో ముచ్చట**

**ధరలు, వాళ్ల కష్టనష్టాల గురించి ఆరా**

దేశంలోని సమస్యలను తెలుసుకునేందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రజలతో మమేకమవుతున్నారు. మెకానిక్‌లతో, ట్రక్కు డ్రైవర్లతో, రైతులతో.. ఇలా అవకాశం చిక్కినప్పుడల్లా వారిని కలిసి మాట్లాడుతున్నారు. వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో కూరగాయల మార్కెట్‌లో ఆయన ప్రత్యక్షమయ్యారు. ఈ రోజు తెల్లవారుజామున ఢిల్లీలో ఓ మార్కెట్ ను రాహుల్ ఆకస్మికంగా సందర్శించారు. ఆసియాలోనే అతిపెద్ద మార్కెట్ అయిన ఆజాద్‌పూర్ మండీలో కలియదిరిగారు. కూరగాయలు, పండ్ల వ్యాపారులతో మాట్లాడారు. ధరల వివరాలను ఆరా తీశారు. ఇందుకు సంబంధించిన వీడియోను కాంగ్రెస్ ట్వీట్ చేసింది. అంతకుముందు శనివారం రామేశ్వర్ అనే వ్యాపారి మాట్లాడుతూ కన్నీళ్లు పెట్టుకుంటున్న వీడియోను రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు. టమాట ధరలు ఎక్కువగా ఉన్నాయని, వాటిని కొనేందుకు తన దగ్గర డబ్బులు లేవని ఆ



వ్యాపారి కన్నీళ్లు పెట్టుకున్నాడు. "మేం వాటిని ఏ ధరకు విక్రయిస్తామో మాకే తెలియదు. అవి వర్షంలో తడిసిపోయినా, లేదా ఇంకేమైనా జరిగినా.. మేం మొత్తం నష్టపోతాం" అని చెప్పాడు. రోజుకు రూ.100 నుంచి రూ.200 కూడా రావడం లేదని వాపోయాడు. "ఈ దేశం రెండు వర్గాలుగా విడిపోయింది. ఓవైపు ప్రభుత్వ మద్దతు ఉన్న ధనికులు.. మరోవైపు ధరల పెరుగుదలతో ఇక్కట్లు పడుతున్న పేదలు ఉన్నారు. ధనికులు, పేదల మధ్య అంతరం పెరిగిపోతోంది. దీన్ని మనం మార్చాలి. ఈ కన్నీళ్లను తుడవాలి" అంటూ ఈ వీడియోపై రాహుల్ రాసుకొచ్చారు. ఈ నేపథ్యంలోనే కూరగాయల మార్కెట్‌కు రాహుల్ వెళ్లినట్లు సమాచారం.

## తెలంగాణలో టెట్ నోటిఫికేషన్ విడుదల

**సెప్టెంబర్ 15న టెట్ పేపర్-1, పేపర్ -2 పరీక్షలు**

**రేపటి నుంచి ఈనెల 16 దాకా దరఖాస్తులు**

**పరీక్షలకు రెండున్నర లక్షల మంది దాకా హాజరయ్యే అవకాశం**

తెలంగాణ ప్రభుత్వం ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. సెప్టెంబర్ 15న టెట్ పేపర్-1, పేపర్ -2 పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రకటించింది. రేపటి నుంచి ఈ మేరకు దరఖాస్తులను స్వీకరించనుంది. ఈ నెల 16వ తేదీ దాకా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయవచ్చు. ఒక్కో పరీక్ష ఫీజు రూ.400. పేపర్-1 పరీక్షను డీఈడీ, బీఈడీ అభ్యర్థులు రాసుకునేందుకు అవకాశం కల్పించారు. బీఈడీ చేసిన వాళ్లు రెండు పేపర్లను రాసుకోవచ్చు. ఈ సారి టెట్ పరీక్షకు 2 లక్షల నుంచి రెండున్నర లక్షల మంది హాజరయ్యే అవకాశం ఉంది. సెప్టెంబర్ 15న పరీక్ష నిర్వహించి, అదే నెల 27న ఫలితాలు విడుదల చేసే అవకాశం ఉందని సమాచారం.

# రౌడీయిజం చేస్తే తాటతీస్తా

- మొదటి పేజీ తరువాయి

మండిపడ్డారు. రౌడీయిజం చేస్తే తాటతీస్తానని హెచ్చరించారు. ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా ఈ రోజు నంద్యాల జిల్లాలో చంద్రబాబు పర్యటించారు. నందికొట్కూర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. సాగునీటి ప్రాజెక్టులపై యుద్ధభేరి ప్రకటించాలని వచ్చానని చెప్పారు. రాయలసీమకు జగన్ ద్రోహం చేశారని మండిపడ్డారు. రాయలసీమ కోసం జగన్ ఏనాడైనా పనిచేశారా? అని చంద్రబాబు ప్రశ్నించారు. రాయలసీమకు ద్రోహం చేసిన వ్యక్తి జగన్ అన్నారు. రాయలసీమలో తాము రూ.12,400 కోట్లు ఖర్చుపెట్టామని, రాయలసీమ ద్రోహి ఖర్చుపెట్టింది రూ.2 వేల కోట్లేనన్నారు. సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసంపై యుద్ధభేరి ప్రకటించాలని వచ్చానన్నారు. రూ.10 లక్షలకోట్లు అప్పుతెచ్చి.. రాయలసీమకు రూ.2 వేల కోట్లు ఖర్చు పెట్టారని చంద్రబాబు విమర్శించారు. వైసీపీని భూస్థాపితం చేస్తే తప్ప మనకు న్యాయం జరగదని చంద్రబాబు పేర్కొన్నారు. వైసీపీని భూస్థాపితం చేస్తే తప్ప మనకు న్యాయం జరగదన్నారు. తెలుగుగంగ, ముచ్చుమర్రి ప్రాజెక్టులను టీడీపీనే ప్రారంభించిందని, ఎస్ఆర్‌బీసీ, హంద్రీనీవా ప్రాజెక్టులను టీడీపీనే ప్రారంభించిందన్నారు. నీళు లేని ప్రాజెక్టులు చేసిన ఘనత చరిత్రహీనుడు ఈ సీఎంది అన్నారు. నాలుగున్నరేళ్లలో యువతకు ఒక్క ఉద్యోగమైనా ఇచ్చారా? అని చంద్రబాబు ప్రశ్నించారు.

రోడ్డుకు మట్టి వేయలేరుగానీ.. 3 రాజధానులు కడతారట అంటూ చంద్రబాబు ఎద్దేవా చేశారు. ఒక రాజధానిని నాశనం చేసి.. 3 రాజధానులంటున్నారన్నారు. మన రాజధాని ఏదంటే చెప్పుకోలేని దుస్థితిలో ఉన్నామన్నారు. పరదాల మాటున కాదు.. ధైర్యం ఉంటే ప్రజల్లోకి రా జగన్ అని సూచించారు. నందికొట్కూరుకు వచ్చి తాను అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పాలన్నారు. రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ అయినా జగన్ తీసుకొచ్చారా అని చంద్రబాబు ప్రశ్నించారు. ఉన్న పరిశ్రమలు కూడా పారిపోయే పరిస్థితి తీసుకొచ్చారన్నారు. తాము రూ.1,200 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేశామని, భూమి రూ.5 లక్షలకు కొని రూ.60 లక్షలకు అమ్మడమే వీళ్ల పని అని చంద్రబాబు ఆరోపించారు. వైసీపీ పాలనలో



నియోజకవర్గానికి ఒక సైకో తయారవుతున్నారని స్థానిక వైసీపీ నేత బైరెడ్డి సిద్దార్థ్ రెడ్డిని ఉద్దేశించి ఆరోపించారు. రౌడీయిజం చేస్తే తాటతీస్తానన్నారు. వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. పనిచేయని వైసీపీ నాయకులను మురికికాల్వలో ముంచేస్తే బుద్ధి వస్తుందన్నారు. బటన్ నొక్కుతున్నా అని జగన్ పదే పదే చెబుతున్నారని,

బటన్ నొక్కడం కాదు, బటన్ బుక్కుడు ఎక్కువైందన్నారు. పైన రూ.10 పంపిస్తారు.. కింద రూ.90 నొక్కుతున్నారన్నారు.

విద్యుత్ ఛార్జీలు పెంచుకుంటూ పోతున్నారని, ఇప్పటికే 8 సార్లు పెంచారని చంద్రబాబు ఆరోపించారు. కొత్త విద్యుత్ పాలసీ తీసుకొస్తానని హామీ ఇచ్చారు. విద్యుత్ ఛార్జీలు తగ్గించే బాధ్యత తనదే అన్నారు. ఆడబిడ్డ నిధి కింద ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తానన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని, యువగళం సూపర్ హిట్ అయింది.. యువతలో చైతన్యం వచ్చిందన్నారు. 20 లక్షల కంటే ఎక్కువే ఉద్యోగాలు ఇస్తామన్నారు. జాబు రావాలంటే బాబు రావాల్సిందేనన్నారు. నాసిరకం మద్యం సరఫరాతో పేదల రక్తం తాగుతున్నారని వైసీపీ సర్కార్ పై విమర్శలు గుప్పించారు. పాత మద్యం విధానం తెచ్చి ధరలు తగ్గిస్తామన్నారు. నాసిరకం మద్యం నుంచి విముక్తి కలిగిస్తామన్నారు.

తాము అధికారంలోకి వచ్చాక విద్యుత్ చార్జీలను తగ్గిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తామని చెప్పారు. 20 లక్షల కంటే ఎక్కువ ఇస్తామని తెలిపారు. జాబు కావాలంటే బాబు రావాల్సిందేనని తేల్చిచెప్పారు. మూడు రాజధానులపై చంద్రబాబు వ్యంగ్యాస్త్రాలు సంధించారు. రోడ్డుకు మట్టి వేయలేరు కానీ 3 రాజధానులు కడతారట అంటూ ఎద్దేవా చేశారు. "ఒక రాజధానిని నాశనం చేసి మూడు రాజధానులని అంటున్నారు. మన రాజధాని ఏదంటే చెప్పుకోలేని దుస్థితిలో మనం ఉన్నాం" అని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీని భూస్థాపితం చేస్తే తప్ప మనకు న్యాయం జరగదని అన్నారు.

**మందు బాబులకు కిక్ ఇచ్చే**
**వార్తను చెప్పిన చంద్రబాబు**

నంద్యాల జిల్లా నందికొట్కూరు బహిరంగసభలో చంద్రబాబు మాట్లాడుతూ మందుబాబులకు మాంచి కిక్ ఇచ్చే విషయాన్ని చెప్పారు. టీడీపీ అధికారంలోకి వస్తే మద్యం ధరలను తగ్గిస్తామని హామీ ఇచ్చారు. నాణ్యమైన మద్యాన్ని సరఫరా చేస్తామని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత నాసిరకం మద్యాన్ని విక్రయిస్తున్నారని విమర్శించారు. బూమ్ బూమ్, స్పెషల్ స్టేటస్, బ్రిటీష్ ఎంపైర్, బ్లాక్ బస్టర్ వంటి విచిత్రమైన బ్రాండ్లను అమ్ముతున్నారని దుయ్యబట్టారు. ఈ నాసి రకం మద్యాన్ని తాగి ఎంతో మంది ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరో 6 నెలలు ఆగితే మీ బతుకులను బాగు చేస్తానని చెప్పారు

# జగన్‌కు సొంత సామాజికవర్గంలో కూడా వ్యతిరేకత

- మొదటి పేజీ తరువాయి

ఆశీర్వచనాలతో యువనేతను పల్నాడు జిల్లా ప్రజలు స్వాగతించారు. యువగళానికి సంఘీభావంగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా తరలివచ్చారు. అక్కడ నుంచి రాముడుపాలెం, జేసీ నగర్, రవ్వవరం, పుచ్చనూతల, కొత్తరెడ్డిపాలెం, లక్ష్మీపురం, నూజెండ్ల మీదుగా గురప్పనాయుడుపాలెం విడిది కేంద్రానికి చేరుకుంది.

టీడీపీ యువనేత నారా లోకేశ్ పాదయాత్ర ఉమ్మడి ప్రకాశం జిల్లా నుంచి ఉమ్మడి గుంటూరు జిల్లాలోకి ప్రవేశించింది. వినుకొండ నియోజకవర్గంలోకి లోకేశ్ అడుగుపెట్టారు. అంతకు ముందు ప్రకాశం జిల్లా దర్శి నియోజకవర్గ నేతలు, కార్యకర్తలతో లోకేశ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరిలో పట్టుదల ఉందని, కచ్చితంగా టీడీపీ గెలవబోతోందని చెప్పారు. అనునిత్యం ప్రజలతో ఉండే బలమైన అభ్యర్థిని ప్రకటిస్తామని తెలిపారు. పార్టీకి ఇన్ఛార్జ్ లేకపోయినా దర్శి నియోజకవర్గంలో పాదయాత్ర సక్సెస్ అయిందని చెప్పారు. ఎన్నికల తర్వాత ఇన్ఛార్జ్ వ్యవస్థ ఉండదని అన్నారు. గ్రామ కమిటీలను బలోపేతం చేస్తామని చెప్పారు. భవిష్యత్తుకు గ్యారంటీ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. వర్గ విభేదాలను పక్కన పెట్టి పార్టీ గెలుపు కోసం పని చేయాలని చెప్పారు. దొంగ ఓట్లపై దృష్టి పెట్టాలని చెప్పారు. సీఎం జగన్ కు సొంత సామాజికవర్గంలో కూడా వ్యతిరేకత ఉందని అన్నారు.

**ప్రకాశంజిల్లా నేతల ఘన వీడ్కోలు**

వినుకొండ నియోజకవర్గ శివార్లలో యువనేతకు ప్రకాశం



నేతలు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... తనను తోబుట్టువులా ఆదరించిన ప్రకాశం జిల్లా ప్రజల రుణం తీర్చుకుంటానని అన్నారు. ఏ కష్టమొచ్చినా పార్టీ కేడర్ కు వెన్నంటి ఉంటానని భరోసా ఇచ్చారు. యువగళం స్ఫూర్తితో రాబోయే ఎన్నికల్లో పసుపుజెండా రెపరెపలాడాలని చెప్పారు. నాయకులంతా కలసికట్టుగా పనిచేసి పార్టీని విజయపథంలో నడిపించాలని కోరారు. ఈనాటి పాదయాత్రలో అన్ని గ్రామాల ప్రజలతో లోకేశ్ ముచ్చటించారు. రాష్ట్రంలో ప్రజలకు గుక్కెడు నీళ్లందించడం చేతగాని ముఖ్యమంత్రి లక్షల కోట్లతో సంక్షేమం చేశానని ప్రగల్భాలు పలకడం సిగ్గుచేటని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మంచినీటి సదుపాయం కల్పించుకునేందుకు కేంద్రం ఇచ్చిన నిధులను కూడా ఈ ప్రభుత్వం వినియోగించుకోలేకపోతోందని ఎద్దేవా చేశారు. జల్ జీవన్ మిషన్ అమలులో రాష్ట్రం 18వ స్థానంలో ఉందని దుయ్యబట్టారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక వాటర్ గ్రిడ్ ఏర్పాటు చేసి, ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా స్వచ్ఛమైన మంచినీరు అందిస్తామని హామీ ఇచ్చారు.

జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక గ్రామాభివృద్ధికి గ్రహణం పట్టిందని లోకేశ్. పంచాయతీల అభివృద్ధికి కేంద్రం విడుదల చేసిన రూ.9 వేల కోట్ల నిధులను జగన్ ప్రభుత్వం దొంగిలించిందని ఆరోపించారు. పంచాయతీల్లో బ్లీచింగ్ చల్లడానికి కూడా చిల్లిగవ్వ లేని దుస్థితి నెలకొందని అన్నారు. టీడీపీ హయాంలో గ్రామీణ ప్రాంతాల్లో 25వేల కిలోమీటర్ల సీసీ రోడ్లువేశామని చెప్పారు. వాటర్ గ్రిడ్ ద్వారా సురక్షిత నీటిని ఇంటింటికీ కుళాయిల ద్వారా అందిస్తామని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి స్కీమ్ లోనూ ఒక స్కామ్ ఉంటుందని లోకేశ్ విమర్శించారు. సెంటు పట్టాల పేరుతో పనికిరాని స్థలాలను కేటాయించి రూ. 7 వేల కోట్లు దోచుకున్నారని చెప్పారు. టీడీపీ అధికారంలోకి రాగానే ప్రతి పేదవాడికి ఇంటి స్థలంతో పాటు ఇల్లు నిర్మించి ఇస్తామని తెలిపారు. గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలకు పెద్ద పీట వేస్తామని చెప్పారు. జగన్ అధికారంలోకి వచ్చాక 9 సార్లు విద్యుత్ ఛార్జీలు, 3 సార్లు ఆర్టీసీ ఛార్జీలు పెంచి జనం నడ్డివిరిచారని మండిపడ్డారు. మరోవైపు ఈనాటి పాదయాత్రలో లోకేశ్ ను జేసీ ప్రభాకర్ రెడ్డి కలుసుకున్నారు. లోకేశ్ ను హత్తుకుని అభినందలను తెలియజేశారు.

# ఇది ఆణిముత్యంలాంటి ప్రాజెక్టు

- మొదటి పేజీ తరువాయి

శ్రీకారం చుట్టాం. 17 ఎకరాల స్థలానికిగాను... 12-13 ఎకరాల పెద్ద విస్తీర్ణంలో మాల్ రావడం అన్నది కొన్ని చోట్లే ఉంటుంది. ఇదే రహేజా గ్రూపు హైదరాబాద్‌లో ఇనార్బిట్ మాల్‌ను 7-8 ఎకరాల్లోనే కడితే మనం 12-13 ఎకరాల విస్తీర్ణంతో పెద్ద మాల్‌కు ఇక్కడ శంకుస్థాపన చేసుకున్నాం. ఈ కార్యక్రమాన్ని సాధ్యమయ్యేలా చేసిన నీల్ రహేజాకు, సీఈఓ రజనీష్ మహాజన్‌కు, సీఓఓ శ్రావణ్ కుమార్‌తో పాటు మిగిలిన అందరికీ రాష్ట్ర ప్రభుత్వం తరపున, నా తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు.

**మారనున్న విశాఖ రూపురేఖలు....**

ఈ రోజు ఇక్కడ కడుతున్న మాల్ నిర్మాణం ద్వారా విశాఖపట్నం రూపురేఖలు మారడమే కాకుండా... దక్షిణ భారతదేశంలోనే పెద్ద మాల్ కానుంది. రూ.600 కోట్ల పెట్టుబడితో ఇంత పెద్ద విస్తీర్ణంలో మాల్ నిర్మాణం వల్ల... 8వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు లభిస్తాయి.

**ఫేజ్ -2లో ఐటీ స్పేస్,**
**ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్**

12 నుంచి 13 ఎకరాల్లో మాల్ నిర్మాణం పూర్తయిన తర్వాత.... మిగిలిన భూమిలో రాబోయే రోజుల్లో రెండో దశ ప్రాజెక్టులో భాగంగా ఇక్కడ రెండున్నర లక్షల ఎస్ఎఫ్‌టీతో ఐటీ స్పేస్ కూడా రాబోతుంది. అంతర్జాతీయ స్థాయిలో ఒక కన్వెన్షన్ సెంటర్‌ను కూడా నిర్మించనున్నారు. వీటన్నింటి ద్వారా ఇంకా ఉద్యోగఅవకాశాలు మెరుగవుతాయి. 2.50 లక్షల ఎస్ఎఫ్‌టితో ఐటీ స్పేస్ రావడం వల్ల మరో 3,000 మందికి ఉద్యోగ అవకాశాలు కూడా రానున్నాయి. ఇవన్నీ రాబోయో రోజుల్లో విశాఖపట్టణాన్ని అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టే కార్యక్రమాలు. ఇంతకముందు వచ్చినప్పుడు ఆదానీ





గ్రూపు ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న డేటాపార్కు, ఐటీ స్పేస్‌కు శంకుస్థాపన చేసుకున్నాం. అదే రోజు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ పనులకు కూడా శంకుస్థాపన చేశాం. అంతకన్నా ముందు శ్రీకాకుళంలో ఉత్తరాంధ్ర రూపురేఖలు మార్చే విధంగా మూలపేటలో పోర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేసుకున్నాం. ఇవన్నీ ఉత్తరాంధ్రా అభివృద్ధి రూపురేఖలను మార్చే గొప్ప అడుగులు. ఇనార్బిట్ మాల్ కూడా అలాంటిదే.

**ఇవన్నీ విశాఖలో గొప్ప ప్రాజెక్టులుగా నిలుస్తాయి**

ఇవి కాకుండా రహేజా గ్రూపు దేశంలో పలుచోట్ల ఫైవ్ స్టార్ హొటళ్లు కట్టారు. అదే మాదిరిగా మన రాష్ట్రంలో రాజ్‌విలాస్ తరహాలో సూపర్ లగ్జరీ ఫైవ్‌స్టార్ ప్లస్, సెవెన్ స్టార్ హొటల్ కట్టబోతున్నారు. ఇప్పటికే ఒబెరాయ్, మేపెయిర్ హొటల్స్ గ్రూపు వాళ్లు కూడా కడుతున్నారు. ఆ తరహాలో రహేజా గ్రూపు కూడా సెవెన్ స్టార్ లగ్జరీ రిసార్ట్‌ల నిర్మాణంలో మూడో గ్రూపు కానుంది. ఇవన్నీ విశాఖలో గొప్ప ప్రాజెక్టులుగా నిలుస్తాయి. అదే విధంగా హిందూపూర్‌లో కూడా 350 ఎకరాల్లో ఎలక్ట్రానిక్స్, టెక్స్‌టైల్స్‌కు సంబంధించిన పార్కు రాబోతుంది. దానివల్ల మరో 15వేల ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. ఆ ప్రాజెక్టుకు కూడా అడుగులు ముందుకు వేశాము... యుద్ధ ప్రాతిపదికన అది కూడా టేకప్ చేస్తామన్నారు. దానికి కూడా ప్రభుత్వం సపోర్టు చేస్తుంది.

**మేము మీకు ప్రతి అడుగులోనూ తోడుగా ఉంటాం**

ఈ రోజు మీ అందరి ద్వారా రహేజా గ్రూపు అధ్యక్షుడు నీల్‌కు చెప్తున్నాను. మేము మీకు ప్రతి అడుగులోనూ తోడుగా ఉంటాం. కేవలం ఒక్క ఫోన్‌కాల్ దూరంలోనే మీకు అందుబాటులో ఉంటాం. ఈ విషయాన్ని మనసులో పెట్టుకుని... పెట్టుబడులు పెట్టండి. మిగిలిన రాష్ట్రాల కంటే మిన్నగా... ఏపీలో పారిశ్రామికవేత్తలకు ఏ విధంగా సహాయ, సహకారాలు అందిస్తామో మీరు కచ్చితంగా చూస్తారు. దేవుని దయవలన వీళ్లు మరింత బాగుపడి.. మన ప్రాంతంలో అభివృద్ధి జరగాలని ఆకాంక్షిస్తున్నాను. దీని తర్వాత ఆంధ్రాయూనివర్సిటీలో రూ.130 కోట్లతో హై ఎండ్ ఇంక్యుబేషన్ సెంటర్‌తో పాటు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాలు చేస్తున్నాం. ఇవన్నీ రాబోయే రోజుల్లో విశాఖ అభివృద్ధికి దోహదపడతాయి అని సీఎం ప్రసంగం ముగించారు.

## విశాఖ వృద్ధురాలి హత్యపై పిచ్చి రాతలు

- మొదటి పేజీ తరువాయి

చేశారని పచ్చ బ్యాచ్ సీఎం వైఎస్ జగన్‌పై దుష్ప్రచారానికి దిగింది. పచ్చ పార్టీకి.. పిచ్చి రాతలు రాసే వాళ్ల నోళ్లు మూతలుబడేలా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమాధానం చెప్పారు. టీడీపీ అధికారం నుంచి దిగిపోయే టైంకి రూ. 2.64 లక్షల కోట్ల అప్పులు ఉన్నాయి. ఈ నాలుగేళ్లలో రూ. 1,77,991 కోట్ల అప్పులు మాత్రమే చేశారని పార్లమెంట్ సాక్షిగా వెల్లడైంది. ఒక పనికిమాలిన ఎంపి వేసిన ప్రశ్నతో వాస్తవం బట్టబయలైంది. టిడిపి తప్పుడు ప్రచారాలకి ఇది చెంప పెట్టు అని మంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. సీఎం జగన్ నాలుగేళ్లుగా సంక్షేమపాలన అందిస్తున్నారు.. ప్రజాభిమానమూ పెరిగింది. ఆ ఆదరణ చూసి చంద్రబాబు తట్టుకోలేక రాష్ట్రం అప్పులపాలయ్యిందని.. శ్రీలంకలా మారిందని గోబెల్స్ ప్రచారం చేశారు. పేదలపొట్ట కొట్టాలని చంద్రబాబు కుళ్లు రాజకీయాలు చేశారు. కానీ, వాస్తవాలు బయటపడటంతో నోళ్లు మూతబడుతున్నాయి అని అన్నారాయన. విశాఖలో వృద్ధురాలు హత్యపైనా ఈనాడు పత్రిక అబద్దాలు ప్రచురించింది. మొత్తం వలంటరీ వ్యవస్థకు ముడిపెట్టి లేనిపోని రాద్ధాంతం చేస్తోంది. పనితీరు సక్రమంగా లేదని తొలగించిన వ్యక్తిని ఇంకా వలంటీర్ అని ఎలా రాస్తారు. కేవలం పిచ్చి రాతల్లో భాగంగానే ఆ కథనం ప్రచురించింది అని మంత్రి మండిపడ్డారు. చంద్రబాబు మూడు టర్మ్‌లలో రూ.7.50 లక్షల కోట్లు ఏం చేశారు? మూడు సార్లు సీఎంగా పని చేసి సంక్షేమాన్ని ఎందుకు అందించలేకపోయారు?. మా ప్రభుత్వం నాలుగేళ్లలో నేరుగా ప్రజలకి అందించిన సంక్షేమమే 2.50 లక్షల కోట్లపైనే. చంద్రబాబు చెబుతున్న అబద్ధాలకు ఆస్కార్ ఇవ్వొచ్చు. సీఎంగా ఉండి ఏనాడైనా పోలవరం పేరు ఎత్తాడా?. పోలవరానికి దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి అడ్డుపడ్డాడని చంద్రబాబు ఎలా అంటారు?. అసలు వైఎస్సార్ హయాంలో పోలవరం పనులు ప్రారంభయ్యాయి. కుడి, ఎడమ కాలువలు పూర్తి చేశారు. కమీషన్ కోసం కుక్కుర్తి పడి పోలవరాన్ని నిర్మాణాన్ని చంద్రబాబు చేపట్టలేదా?. ఈనాడు రామోజీరావు వియ్యంకుడికి వందల కోట్ల పనులు అప్పనంగా అప్పగించలేదా? అని నిలదీశారు. చంద్రబాబు దుర్మార్గుడు. చంద్రబాబు కొడుకు మాలోకం. అది యువగళమా.. విషగళమా?. ఎవరు ఎక్కువ కేసులు పెట్టించుకుంటే వారికే పెద్ద పదవులట!. టీడీపీ అధికారంమలోకి వస్తే కర్రలు ఇస్తాడట. ఇదీ రాబోయే కాలంలో వాళ్ల అజెండా. జోకర్ కొడుకు.. బ్రోకర్ తండ్రి అని పేర్కొన్నారాయన.

పవన్‌ని చూస్తే జాలేస్తోంది

చిరంజీవి కుటుంబంపై చంద్రబాబు చేసిన కుట్రలు అందరికి తెలుసు. కాపులని అనాదిగా తొక్కడానికి చంద్రబాబు చేయని ప్రయత్నం లేదు. రంగా హత్య నుంచి ముద్రగడ కుటుంబాన్ని వేధించే దాకా కాపులని అడుగడుగునా చంద్రబాబు కుట్ర ఉంది. అలాంటి చంద్రబాబు విష కౌగిలిలో పవన్ చిక్కకుపోయాడు. పవన్ స్టార్ నుంచి ప్యాకేజీ స్టార్ గా మారిపోయాడు. నా పార్టీ పెట్టిన ధ్యేయమే వైఎస్ జగన్ ని గద్దె దించడమే అని పవన్ అంటున్నాడు. పవన్ పై ప్రేమ ఉంటే ప్యాకేజ్ ఇవ్వలేదని ఏనాడైనా చంద్రబాబు చెప్పాడా?. అందుకే చంద్రబాబు విష కౌగిలి నుంచి పవన్ బయటపడాలి అని సూచించారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ సినిమాల్లో పవర్ స్టార్ అని, కానీ ఆయన రాజకీయాల్లో ప్యాకేజీ స్టార్‌గా మారిపోయారని మంత్రి కొట్టు సత్యనారాయణ విమర్శలు గుప్పించారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఏం చెప్పమంటే ఆయన అదే చెబుతున్నారని, అలా చెప్పడమే కాదు.. దిగజారి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ప్యాకేజీ స్టార్‌లా మారిన పవన్‌ను చూస్తుంటే జాలేస్తోందన్నారు. కాపులను తొక్కేయడానికి చంద్రబాబు చేయని ప్రయత్నమంటూ లేదన్నారు. చంద్రబాబు విషకౌగిలి నుండి పవన్ ఇప్పటికైనా బయటపడాలన్నారు. చిరంజీవి కుటుంబంపై చంద్రబాబు చేసిన కుట్రలు అందరికీ తెలిసిందేనని, వాటిని పవన్ తెలుసుకోవాలన్నారు. ఇదిలా ఉండగా, అంతకుముందు మంత్రి కొట్టు బెజవాడ ఇంద్రకీలాద్రిపై గిరి ప్రదక్షిణను ప్రారంభించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, రథాన్ని లాగి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి నెల పౌర్ణమి రోజున గిరి ప్రదక్షిణ నిర్వహించడం ఆనవాయతీగా వస్తోందన్నారు. ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ చేస్తే అమ్మవారి అనుగ్రహం కలుగుతుందన్నారు.

## రాయపాటి నివాసం సహా తొమ్మిదిచోట్ల ఈడీ సోదాలు

**ట్రాన్స్‌స్ట్రాయ్ డైరెక్టర్ల ఇళ్లలోను ఈడీ బృందాల సోదా**

**13 బ్యాంకుల నుండి రూ.9 వేల కోట్లకు పైగా రుణాలు**

**సీబీఐ ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ మనీలాండరింగ్ కేసు నమోదు**

తెలుగుదేశం పార్టీ నేత, మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావు సహా ట్రాన్స్‌స్ట్రాయ్ డైరెక్టర్ల ఇళ్లలో ఈడీ సోదాలు నిర్వహించింది. హైదరాబాద్, గుంటూరులో తొమ్మిది చోట్ల ఈడీ బృందాలు తనిఖీలు నిర్వహిస్తున్నాయి. రాయపాటి హైదరాబాద్, జూబ్లి హిల్స్ లోని రోడ్ నెంబర్ 27లో నివసిస్తున్నారు.



హైదరాబాద్‌తో పాటు గుంటూరులోని ఆయన నివాసాల్లో ఈడీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. ఈ కంపెనీ దాదాపు పదమూడు బ్యాంకుల నుండి తొమ్మిది వేల కోట్లకు పైగా రుణాలు తీసుకొని, డొల్ల కంపెనీలకు మళ్లించినట్లుగా సీబీఐ ఇదివరకు కేసు నమోదు చేసింది. సీబీఐ ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది. ట్రాన్స్‌స్ట్రాయ్ కంపెనీ ఖాతాల నుండి నిబంధనలకు విరుద్ధంగా సింగపూర్‌కు నగదు బదిలీ అయినట్లు ఈడీ అధికారులు అనుమానిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం సోదాలు జరుగుతున్నాయి.

## ఎన్నికల హామీలు నెరవేర్చలేదని చెప్పుతో కొట్టుకున్న నర్సీపట్నం కౌన్సిలర్

**నిండు సభలో కన్నీరు పెట్టిన వైనం.. ఏపీలోని అనకాపల్లి జిల్లాలో ఘటన**

**డ్రెయినేజీ, రోడ్లు వంటి కనీస అవసరాలనూ తీర్చలేకపోతున్నానంటూ ఆవేదన**

**సోషల్ మీడియాలో వైరల్ గా మారిన వీడియో**

ఎన్నికల్లో గెలిచి 31 నెలలు పూర్తయినా ఇప్పటికీ ఎన్నికల హామీలను నెరవేర్చలేక పోయానంటూ ఓ కౌన్సిలర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ మీటింగ్ లో చెప్పుతో కొట్టుకున్నారు.. ప్రజల కనీస అవసరాలు తీర్చలేకపోతున్నందుకు ఈ సభలోనే చనిపోవాలని అనిపిస్తోందంటూ కన్నీటిపర్యంతమయ్యారు. ఈ సంఘటన ఆంధ్రప్రదేశ్ లోని నర్సీపట్నం మున్సిపాలి టీలో



సోమవారం నాటు చోటుచేసుకుంది. తెలుగుదేశం పార్టీ నుంచి ములపర్థి రామరాజు నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలోని లింగాపురం గ్రామం నుంచి కౌన్సిలర్ గా ఎన్నికయ్యారు. ఎన్నికల సందర్భంగా తన వార్డు పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపడతానని, కనీస సదుపాయలను కల్పిస్తానని ప్రజలకు హామీ ఇచ్చినట్లు రామరాజు చెప్పారు. కౌన్సిలర్ గా గెలిచి ఇప్పటికి 31 నెలలు పూర్తవుతోందని, తన వార్డు సమస్యలను పరిష్కరించేందుకు అన్ని రకాలుగా ప్రయత్నించినా విఫలమయ్యానని వివరించారు. సివిక్ బాడీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా తన వార్డు ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదని వాపోయారు. కౌన్సిలర్ గా ఉండి కూడా ప్రజలకు ఏమీ చేయలేకపోతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్ లో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వీడియోను తెలుగుదేశం పార్టీ సోషల్ మీడియాలో అప్ లోడ్ చేసింది. దీంతో ఈ వీడియో ప్రస్తుతం వైరల్ గా మారింది.

## రెడ్ క్రాస్ సంస్థ సేవలు నిరంతరం కొనసాగించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు




**కామారెడ్డి జిల్లా** పవర్ ఆఫ్ జర్నలిజం ప్రతినిధి, **ఆగస్టు 01** కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సి.పి.ఆర్. కార్యక్రమాలను జిల్లా, డివిజన్ స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి మండలంలో జూనియర్ రెడ్ క్రాస్ సొసైటీ, యూత్ రెడ్ క్రాస్ సొసైటీ, నూతన సభ్యత్వాలను ముమ్మరంగా చేపట్టాలని అన్నారు. ఇటీవల వర్షాలకు ప్రమాదకరంగా ఉన్న ఇండ్లకు తాటిపత్రులను అందజేయాలని కోరారు. రోడ్డు ప్రమాదాలు జరుగకుండా రోడ్డు భద్రతపై గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలన్నారు. ఆరోగ్య, ఆశా కార్యకర్తలను సభ్యులుగా చేర్పించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రభలకుండా గ్రామ స్థాయిలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని తెలిపారు. హరితహారంలో భాగంగా తులసి, నేలఉసిరి ,మునగ, బొప్పాయి, కరివే పాకు వంటి 5 రకాల ఔషధ మొక్కలు ఇంటింటికి పంపిణీచేసే విధంగా చూడాలన్నారు. ప్లాస్టిక్ వేస్ట్ మేనేజిమెంట్, ఎకో బ్రిక్స్ పై అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 16 నుంచి 14 రోజుల పాటు కుష్టువ్యాధి నిర్మూలనపై వైద్యారోగ్య శాఖా ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. జిల్లాలోని 3 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలలో నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని మహిళలు అధిక సంఖ్యలో వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. జన ఔషధ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కేంద్రంలో ఉన్న డయాగ్నస్టిక్ హబ్ లో 57 రకాల వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు.జిల్లా రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్ రాజన్న మాట్లాడుతూ.. రెడ్ క్రాస్ సంస్థ గత మూడు మాసాలలో జిల్లాలోని 22 మండలాలలో 48 క్యాంపులు నిర్వహించి వివిధ రకాల కార్యకలాపాలు చేపట్టామని, 380 యూనిట్ల రక్త నిధిని సేకరించామని తెలిపారు ఈ సమావేశంలో సంస్థ వైస్ చైర్మన్ నాగరాజు గౌడ్, ప్రధాన కార్యదర్శి రఘుకుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సంజీవ రెడ్డి, కోశాధికారి దస్తి రామ్, కార్యవర్గ సభ్యులు వైద్యుడు విక్రమ్, నరసింహం, మానేటి కృష్ణ, నాగేశ్వర్ రావు పాల్గొన్నారు

# పనుతుల జయరామ్ ఆధ్వర్యంలో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ పంపిణీ కార్యక్రమం

పవర్ ఆఫ్ జర్నలిజం ప్రతినిధి, **ఆగస్టు 01:** ఈరోజు చల్లపేట శ్రీ సంతోషి మాత కళ్యాణమండపం లో నియోజకవర్గ నాయకులు పనుతుల జయరామ్ ఆధ్వర్యంలో క్రియాశీలక వాలంటీర్లకు మరియు జనసైనికులకు కిట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జయరామ్ మాట్లాడుతూ దేశ చరిత్ర లో ఎన్నడు లేని విధంగా క్రియాశీలక సభ్యత్వ నమోదు ద్వారా కార్యకర్తలకు ఐదు లక్షల ప్రమాద బీమా కల్పించి తద్వారా వారి కుటుంబాల కు అధ్యక్షులు పవన్ కళ్యాణ్ గారు అండగా ఉన్నారని తెలియపరచారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని నాయకులు సారవకోట జలుమురు నరసన్నపేట, పోలకి మండల నాయకులు సంతోష్, కిరణ్ శ్రీను,ధనుంజయ, చిరంజీవి మోషి, సురేష్, చందు మరియు జనసైనికులు మండల తదితరులు పాల్గొన్నారు.







# మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించండి

శేరిలింగంపల్లి పవర్ ఆఫ్ జర్నలిజం ప్రతినిధి, **ఆగస్టు 01:** శేర్లింగంపల్లి మండల పరిధిలో మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం రోజు శేరిలింగంపల్లి మండల జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ వద్ద సిఐటియూ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులతో ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి మండల సిఐటియు కార్యదర్శి కొంగరి కృష్ణ మాట్లాడుతూ. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న పథకాల్లో భోజన పథకం ఈ పథకం కింద శేర్లింగంపల్లి మండల పరిధిలో 325 కార్మికులు ఈ పథకం కింద పాఠశాలలో విద్యార్థి విద్యార్థులకు వంట వండి వడ్డిస్తున్నారు కార్మికులు గత 23 సంవత్సరాలుగా ఈ పథకాన్ని నమ్ముకొని పనిచేస్తున్నారు. కానీ ఈ విద్యా సంవత్సరం మొదలుకొని ఈ పథకాన్ని ప్రైవేటు వ్యక్తులైనటువంటి అక్షయపాత్రకు అప్పగించడం కోసం గట్టి ప్రయత్నాలు జరిగాయని ఈ ప్రయత్నాలు తిప్పి కొట్టడం కోసం జిల్లా వ్యాప్తంగా కలెక్టర్ ఆఫీసు , విద్యాశాఖ డైరెక్టర్, డిఇఓ, ఎంఈఓ వద్ద ధర్నాలు మెమొరండాలు



ఇవ్వడం జరిగింది. శేర్లింగంపల్లి మండలంలో స్థానిక ఎమ్మెల్యే అయినటువంటి అరికెపూడి గాంధీ కి కూడా వినతి పత్రాలు ఇచ్చాము కానీ ఏమి పట్టించుకోకుండా కార్మిక ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అక్షయపాత్ర భోజనాన్ని పాఠశాలలో పంపిణీ చేస్తున్న క్రమంలో శేర్లింగంపల్లి జడ్పీహెచ్ఎస్ స్కూల్ వద్ద అక్షయపాత్ర భోజనాన్నిఆపి కార్మికులందరూ కలిసి వెనక్కి పంపడం జరిగింది. ఇప్పటికైనా ప్రభుత్వ, అధికారుల



స్పందించి అక్షయపాత్రకు ఇవ్వకుండా కార్మికుల తోటే వంట వండి విద్యార్థులకు పెట్టే విధంగా చర్య తీసుకోవాలి డిమాండ్ చేస్తున్నాము ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు శ్రీశైలం షణ్ముగం కిరణ్ వరలక్ష్మి ,గోపి, ఏషోధ,పద్మ, గౌరమ్మ, శోబా, గాయిత్రి, రాణి బాయి,రాములు, షేక్ అలి,మౌలానా బి,నసిమ, తదితరులు పాల్గొన్నారు.

## పూర్తి ఆయకట్టుకు సాగునీరు అందిస్తాం



ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి.



**నారాయణపేట** పవర్ ఆఫ్ జర్నలిజం ప్రతినిధి, **ఆగస్టు 01:** రైతుల వ్యవసాయ పొలాలకు పూర్తి ఆయకట్టుకు నీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి వివరించారు మంగళవారం దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి తో కలిసి కోయల్ సాగర్ ప్రాజెక్టు నుండి రైతుల వ్యవసాయ పొలాలకు ఎడమ కాలువ ద్వారా నీటిని విడుదల చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని పెట్టుబడి సాయం కింద ప్రతి ఎకరాకు 5000 రూపాయలను ప్రభుత్వం రైతులకు అందిస్తుందని ఈ పథకం దేశంలో ఏ రాష్ట్రంలో లేదని అన్నారు. ఒకవైపు రైతు సంక్షేమానికి పాటుపడడం వల్లే రైతు బీమాను అమలు చేయడం జరుగుతుందని రైతులు పండించిన ధాన్యాన్ని కూడా గిట్టుబాటు ధరతో రైతుల వ్యవసాయ పొలం వద్దనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని స్వీకరిస్తున్నట్లు తెలిపారు

## ఘనంగా తిమ్మప్ప స్వామి కళ్యాణం



**జోగులాంబ గద్వాల,** పవర్ ఆఫ్ జర్నలిజం ప్రతినిధి, **ఆగస్టు 01:** ఆదిశిలా క్షేత్రమైన మల్దకల్ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం పౌర్ణమి సందర్భంగా తిమ్మప్ప స్వామి కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. దేవాలయ కళ్యాణ మండపంలో ఆలయ అర్చకులు మధుసూదనాచారి, రవిల ఆధ్వర్యంలో వేదమంత్రాలతో శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుని కల్యాణాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. వడ్డేపల్లి మండలం పచ్చర్ల గ్రామానికి చెందిన బి. శ్రీవిద్య మురళీధర్ రావు దంపతులు కళ్యాణాన్ని జరిపించారు. వారికి పట్వారి అరవిందరావు శేష వస్త్రంతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో దీరేంద్ర దాస్, నాగరాజు శర్మ, చక్రధర్, చంద్రశేఖర రావు, వీరారెడ్డి, హనుమన్న తదితరులు పాల్గొన్నారు

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ ను అందించిన జడ్పిటిసి రాజేశ్వరి రామ్



**చిన్న చింతకుంట** పవర్ ఆఫ్ జర్నలిజం ప్రతినిధి, **ఆగస్టు 01:** చిన్న చింతకుంట మండలం అమ్మపురం గ్రామా సర్పంచ్ సులోచన సత్యనారాయణ గౌడ్ ఆదేశానుసారం, మంగళవారం అమ్మాపురం గ్రామానికి చెందిన బోయ రామేశ్వరమ్మ, సుతారి శ్రీదేవి గార్లకు సీఎం. రిలీఫ్ ఫండ్ చెక్ ను జెడ్పిటిసి సభ్యులు రాజేశ్వరి రాము చేతుల మీదుగా అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమం లో అప్పంపల్లి సర్పంచ్ అశోక్ రెడ్డి, అల్లిపుర్ సర్పంచ్ రఘువర్ధన్ గౌడ్, బి ఆర్ ఎస్ మండల యూత్ ఉపాధ్యక్షులు రియాజ్ ,శ్రీ కురుమూర్తిస్వామి దేవస్థాన మెంబర్ అనిల్ గౌడ్, మండల యూత్ ప్రధాన కార్యదర్శి కురుమూర్తి, ఆల యువసేన నాయకులు దశరథ్, అశోక్ లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి కి పుట్టినరోజు శుభాకాంక్షలు

తో కేటీఆర్ చేతుల మీదుగా అవార్డు
ఆమె సొంతం
కొత్తగూడెం ను అభివృద్ధి పథంలో
నడిపిస్తున్న చైర్పర్సన్
అందరితో కలిసి పోయే స్వభావం చైర్ పర్సన్ ప్రత్యేకత

**కొత్తగూడెం** పవర్ ఆఫ్ జర్నలిజం ప్రతినిధి, **ఆగస్టు 01:** మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి పుట్టినరోజు సందర్భంగా వారి జీవితం ఏ విధంగా మలుపుతిరిగిందో ఏ విధంగా రాజకీయాలకు వచ్చారు తదితర అంశాలపై పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేక కథనం.కొత్తగూడెం మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి ఆగస్టు రెండో తారీకు 1982వ సంవత్సరంలోగార్లఒడ్డు ఏన్కూరు మండలం లో రైతు కుటుంబంలో జన్మించిన



సీతాలక్ష్మి వారి సొంత ఊరు కల్లూరు వారు చిన్న వయసులోనే 20 తారీకు 8వ నెల 1997 వ సంవత్సరంలో రామవరం టిఆర్ఎస్ నాయకులు టీబీజీకేఎస్ 11 మెన్ కమిటీ సభ్యులు కావు కృష్ణతో వివాహం జరిగింది. వారికి ఇద్దరు మగ పిల్లలు. వారు కొన్ని సంవత్సరాలు స్వర్ణ భారతి స్కూల్లో టీచర్గా పని చేసినారు. వారి భర్త కాపు కృష్ణ రాజకీయాలలో ఉంటూ మున్సిపల్ ఎలక్షన్స్ లో రామవరం ఆరో వార్డు నుండి టిఆర్ఎస్ అభ్యర్థిగా కౌన్సిలర్ గా రంగంలోకి దించిన కాపు కృష్ణ ప్రజల హృదయాలను గెలిచి గెలుపొందిన సీతా లక్ష్మి..ఎంతోమంది చైర్పర్సన్ పోటీ లో ఉన్నప్పటికీ అదృష్టం వారిని వరించి కొత్తగూడెం మున్సిపల్ చైర్పర్సన్ గా ప్రమాణ స్వీకారం చేయడం జరిగింది. వారు పదవి బాధ్యతలు చేపట్టడంతో ముందుగా కరోనా రావడం జరిగింది. ఒక్కసారిగా కొత్తగూడెం జిల్లా ఉలిక్కి పడింది.కరోనాను కట్టడి చేయడంలో ముందు నిలిచి కీలక పాత్ర పోషించిన చైర్పర్సన్. తర్వాత పట్టణ ప్రగతి కార్యక్రమం హరితహారం కార్యక్రమంలలో ముందు నిలిచి ఆనాటి కలెక్టర్ ఎంవీ రెడ్డి తో ప్రశంసలు అందుకున్న చైర్పర్సన్ కాపు సీతాలక్ష్మి, కరోనాతో దిక్కు లేక చనిపోయిన వారిని ధైర్యంతో దగ్గర ఉండి అంత్యక్రియలు నిర్వహించిన ధైర్యవంతురాలు మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి ఒకానొక సమయంలో అర్ధరాత్రిలో కూడా అంత్యక్రియలలో పాల్గొన్న చైర్పర్సన్,కొత్తగూడెం మున్సిపాలిటీలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది.సెంట్రల్ లైటింగ్ 5 కిలోమీటర్ల వరకు వాటర్ ఫౌంటెన్ పోస్ట్ ఆఫీస్ సెంటర్ వద్ద అంబేద్కర్ విగ్రహం 5 కిలోమీటర్లు సీసీ కెమెరాలు ట్రాఫిక్ సిగ్నల్స్ పట్టణ మెయిన్ రోడ్డు వాల్ పెయింటింగ్స్ నాలుగు కిలోమీటర్ల మేరకు షాదీ ముబారక్ కళ్యాణలక్ష్మిలు ఎనిమిది వందలు మన ఊరు మనబడి రెండు పబ్లిక్ టాయిలెట్స్ 10 డివైడర్స్ 5 కిలోమీటర్లు పార్కులు 10 వైకుంఠధామాలు నాలుగు పట్టణ ప్రగతి వనాలు11బృహత్ ప్రకృతి వదాలు రెండు చిట్టి అడవులు రెండు హరితహారం సర్సరీల ద్వారా మొక్కల పెంపకం ఇంటింటి మొక్కల పెంపకం అమరవీరుల స్తూపం ఒకటి బన్ను షెల్టర్స్ నాలుగు రామవరం ఎస్సీబీ నగర్ కల్వర్టు **షాపింగ్ కాంప్లెక్స్ సెవెన్ ఎల్ సి ఏరియా లో ఒకటి స్లీపింగ్ మిషన్లు రెండు స్వచ్ఛ ఆటో ట్రాలీను 41 చైన్** క్లీనింగ్ మిషన్ ఒకటి వైకుంఠ రథం ఒకటి వీధి వ్యాపారుల ప్రాంగణాలు మూడు ఇంటిగ్రేటెడ్ మార్కెట్ 1 రామవరం లో 100 పడకల ఆసుపత్రి ప్రాంగణం డెవలప్మెంట్ నర్సింగ్ కాలేజ్ జవాన్లు శానిటేషన్ వర్కర్స్ డ్రస్ కోడ్ ఫాగింగ్ మిషన్స్ 8 తడి పొడి చెత్త సేకరణ డిని వీఆర్సీసీ రెండు కమర్షియల్ ఏరియా డస్ట్ బీన్స్ పంపిణీ 1000 బయోమెట్రిక్ మిషన్ సైరు వాకింగ్ ట్రాక్స్ రెండు ఓపెన్ జిమ్స్ 12. క్రీడాకారులకు రెడీమేడ్ కోర్టు ఒకటి రెవెన్యూ ప్లాంటేషన్ 30 కిలోమీటర్ల మేరకు కరెంట్ పోల్స్ 100 ట్రాన్స్ఫార్మర్ల షిఫ్టింగ్ 15 జంతువు సంతతి నియంత్రణ కేంద్రం 1 ఉర్దూ గర్ డెవలప్మెంట్ వార్డు అభివృద్ధి రోడ్డు డ్రైన్ గతంలో డిఎం ఎఫ్.టి నిధులు 48 కోట్లు ప్రస్తుత కౌన్సిల్ 36 వార్డులు అభివృద్ధికి రెండు కోట్ల 88 లక్షలు మంజూరు టాక్స్ సేకరణ 5 కోట్లు గాను నాలుగు కోట్ల 80 లక్షల రూపాయలు అందరి సలహాలతో కొత్తగూడెం పట్టణాన్ని అభివృద్ధిలోకి నడిపించడం జరుగుతుందని వారు అన్నారు మీరు సంతోషించిన సందర్భం ఏదైనా ఉందా అని వార్తా తరంగాలు ప్రతినిధి అడగగా ఎన్నో ఏళ్లుగా అండర్ బ్రిడ్జి నీరు నిలిచిపోవడం అది నా హయాంలో ఎమ్మెల్యే సూచనలతో సలహాలతో దాని శాశ్వత పరిష్కారం చేయడం.ఇంకా అభివృద్ధికి 50 లక్షల రూపాయలు అండర్ బ్రిడ్జికి కేటాయించడం ఇప్పుడు ఎంత వర్షం వచ్చినా కూడా నీళ్లు నిలవకుండా ఉంటున్నాయని ప్రజలు ఎంతో సంతోషపడుతున్నారని ఇంత కంటే ఆనందం అంతకంటే సంతోషం మాకు ఇది చాలని కొత్తగూడెం మున్సి పల్ చైర్ పర్సన్ ఆనందభాష్పాలతో తెలియజేసినారు. కొత్తగూడెం మున్సిపల్ చైర్ పర్సన్ అంచలంచలుగా ఎదగాలని ఇంకా ఉన్నత పదవులు అధిరోహించాలని కోరుకుంటూ..

## పైప్ లైన్ పునరుద్దరణ పనులు పూర్తి

నల్లాల ద్వారా మంచినీటి సరఫరా ప్రారంభం
మునిసిపల్ చైర్మన్ చిన్న దేవన్న



**జోగులాంబ గద్వాల,** పవర్ ఆఫ్ జర్నలిజం ప్రతినిధి, **ఆగస్టు 01 :** జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజ పట్టణంలోని అంబేద్కర్ చౌక్ దగ్గర పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో పగిలిపోయిన మిషన్ భగీరథ పైప్ లైన్ పనులు మంగళవారం పూర్తి చేసి నీటి సరఫరాను ప్రారంభించినట్లు అయిజ మునిసిపల్ చైర్మన్ చిన్న దేవన్న తెలిపారు. పట్టణ ప్రజలు గత 10 రోజుల నుంచి మంచినీళ్లు రాక తీవ్ర ఇబ్బందులు పడడంతో వాటర్ ట్యాంకర్లతో ఎక్కడైతే బోర్లు లేక నీటి ఎద్దడి ఉందో అక్కడ నీటిని సరఫరా చేయించడం జరిగిందన్నారు. పైపులైన్ పనులు పూర్తి కావడంతో ఇక పట్టణంలో మంచినీటికి ఎటువంటి కొరత ఉండదని, నల్లాల ద్వారానే నీటి సరఫరా చేస్తామని తెలిపారు.

## నేషనల్ బాస్కెట్ బాల్ జట్టుకు ఎంపిక



**దేవరకద్ర కౌకుంట్ల** పవర్ ఆఫ్ జర్నలిజం ప్రతినిధి, **ఆగస్టు 01:** కౌకుంట్ల మండలానికి చెందిన రాజా రామ్ చరణ్ సన్నాఫ్ కేబిఆర్ గౌడ్ నేషనల్ బాస్కెట్ బాల్ జట్టుకు ఎంపికయ్యాడు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి బాస్కెట్బాల్ ఎంపికలో పాల్గొని, క్యాంపులో ఉత్తీర్ణత సాధించి పాండిచ్చేరి(తమిళనాడు)లో జరగబోయే 48వ నేషనల్ సబ్ జూనియర్ బాస్కెట్బాల్ జట్టుకు ఎంపిక కావడం జరిగింది. రాజా రామ్ చరణ్ జట్టుకు ఎంపికైన సందర్భంగా కౌకుంట్ల మండల ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు, వారి తల్లిదండ్రులు అభినందించారు.